నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని తెలిపారు.

తిరుపతి నగర కమిషనర్ మౌర్య

సంక్షేమ బోర్డుని కాపాడుకుందాం

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ఆదివారం తిరుపతి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం పెట్లూరు సిఐటియు ఆఫీసు వద్ద రఫీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటి యు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల కష్టాలు రోజురోజుకీ అధికమవుతున్నాయన్నారు. పెరిగిన కరెంటు చార్జీలు, గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలు వాటి కనుగుణంగా ఆదాయాలు లేవన్నారు. పిల్లలను చదివించుకునే స్తోమత లేక అనేకమంది భవన నిర్మాణ కార్మికుల పిల్లలు చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యం చేయించుకునే స్తోమత లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. సంక్షేమ బోర్డులో మూడు వేల కోట్ల రూపాయలు వరకు ఉన్నాయన్నారు. వాటిని సంక్షేమ బోర్డు నుండి ఇతర అవసరాలకు వాడకూడదని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని తెలిపారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎన్ డి శ్రీను మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా ప్రమాదంలో మరణించిన, అంగవైకల్యం పొందినా, పిల్లల వివాహాలకు, కాన్పులకు, దీర్ఘకాలిక జబ్బులకు, మట్టి ఖర్చులకు పరిహారం వచ్చేదన్నారు. ఇప్పుడు గత ఆరు సంవత్సరముల నుండి 1214 సర్క్యులర్ కారణంగా క్లైములు నిలిపి వేసిందన్నారు. అనేక రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం చేస్తున్నాయని తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులు ప్రమాదంలో మరణిస్తే 10 లక్షలు ఇస్తున్నారన్నారు. ఇంటి స్థలం ఉంటే ఇల్లు కట్టుకునేందుకు ఉచితంగా నాలుగు లక్షల రూపాయలు సహాయం చేస్తున్నదన్నారు. కేరళ ప్రభుత్వం 60 సంవత్సరాలు పైబడిన కార్మికులకు నెలకు 1200 రూపాయలు పెన్షన్ ఇస్తున్నదన్నారు. ఇల్లు లేని కార్మికులకు ఇల్లు కట్టిస్తున్నదన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 60 సంవత్సరములు పైబడిన కార్మికులకు నెలకు 750 రూపాయలు పెన్షన్ ఇస్తున్నదని తెలిపారు. అతను చనిపోతే ఆధారపడిన కుటుంబానికి 375 రూపాయలు పెన్షన్, సైకిల్ కొనుగోలుకు 3000 రూపాయలు ఇస్తున్నదన్నారు. కార్మికుడు చనిపోతే అతను వెల్ఫేర్ బోర్డుకు కట్టిన రుసుము ఎనిమిది శాతం వడ్డీతో తిరిగి చెల్లిస్తున్నారన్నారు. హర్యానా, కర్ణాటక, పాండిచ్చేరి, తెలంగాణ, అస్సాం తదితర రాష్ట్రాలలో భవన నిర్మాణ కార్మికులకు అక్కడి ప్రభుత్వాలు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి క్లైయిములు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం తిరుపతి జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ల స్వాధీనం ఆపాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుమలలో ఎఫ్ఎంఎస్ విభాగంలో ఈస్ట్, నార్త్, 6 వ ప్యాకేజీలలో పనిచేస్తున్న కార్మికుల నుండి డ్యూటీ సమయంలో సెల్ ఫోన్లు తీసుకోవడం ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుబ్రమణ్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతిరోజు కార్మికులు డ్యూటీ ఎక్కేటప్పుడు సెల్ ఫోన్లు తీసుకుంటూ, డ్యూటీ దిగగానే ఇస్తున్నారని, ఈ పద్ధతి కార్మికులను అవమానించడమేనని, వారి హక్కులను హరించడమేనన్నారు. భక్తులు రూములు బుక్ చేసుకున్నప్పుడు గతంలో 24 గంటలు సమయం ఉండేదని, ఇప్పుడు ఆన్లైన్ పద్ధతిలో రూములు బుక్ చేసుకునే పద్ధతి ప్రవేశ పెట్టడం వల్ల ఒక్క రూము రోజుకు రెండు సార్లు బుక్ అవుతున్నాయన్నారు. ఆన్లైన్ బుకింగ్ పద్ధతి వల్ల రూములను పలుమార్లు క్లీనింగ్ చేసే పరిస్థితి వస్తుందన్నారు. రోజుకు గతం కన్నా ఎక్కువసార్లు రూములు బుక్ చేసుకోవడం వల్ల, ఖాళీ చేసిన రూములను శుభ్రం చేసే భారం కార్మికులపై పడుతుందన్నారు. అందువల్ల కార్మికుల్ని మరింత పనిచేయించుకోవడానికి సెల్ ఫోన్లు వర్కర్ల నుండి తీసుకుంటున్నారని విమర్శించారు. సరిపడా కార్మికుల లేకపోవడం వల్ల, అదనపు భారం కార్మికులపై పడుతుందన్నారు. పని భారాన్ని తగ్గించడానికి అదనంగా కార్మికులను నియమించాలని పేర్కొన్నారు. కార్మికుల నుండి సెల్ ఫోన్లు డ్యూటీ సమయంలో తీసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని టీటీడీ యాజమాన్యాన్ని సుబ్రమణ్యం కోరారు.

అఖిలభారత కార్మిక సంఘాల సమైక్య రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న అంబేద్కర్ భవన్ కార్యదర్శి కె.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: డిసెంబర్ 8, 9 తేదీల్లో గుంటూరులో జరగనున్న అఖిలభారత కార్మిక సంఘాల సమైక్య - రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆకాంక్షిస్తూ, మహాసభల ప్రచార కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. తిరుపతి అంబేద్కర్ భవన్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ భవన్ కార్యదర్శి కె.నాగేశ్వరరావు ప్రధాన అతిథిగా పాల్గొని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్.మీరయ్య, తిరుపతి జిల్లా ఐఎఫ్టియు నాయకులు మైకేల్, ఐఆర్ఎమ్ యు, సి.ఆర్.ఎస్. బ్రాంచ్ సెక్రటరీ ఆర్ అరవింద్, గుంతకల్ డివిజన్ ఇండియన్ రైల్ మజ్దూర్ యూనియన్ నాయకురాలు, భాను, ప్రగతిశీల ప్రజాతంత్ర విద్యార్థి సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు స్రవంతి, ప్రగతిశీల ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి, పాత కార్మిక చట్టాలను యథావిధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యూ పెన్షన్ స్కీమ్ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ను పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా, ఏఐఎఫ్టీయు జిల్లా నాయకులు మైకేల్ మాట్లాడుతూ టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్స్ హాస్పిటల్, రుయా హాస్పిటల్, ప్రసూతి హాస్పిటల్, బర్డ్ హాస్పిటల్ మున్నగు సంస్థల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలను అమలు చేయాలని కోరారు. తిరుపతిలో ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్/కాంట్రాక్ట్ డ్రైవర్లు వర్క్ లోడ్ ఎక్కువగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారికి రూట్ సర్వే నిర్వహించి టైమింగ్స్ ఫిక్స్ చేయాలని, ఎనిమిది గంటలు దాటిన తర్వాత ఓవర్టైమ్ చెల్లింపులు ఇవ్వాలని, అలాగే యూనిఫాం, హాస్పిటల్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఐఆర్ఎమ్యు నాయకులు అరవింద్ మాట్లాడుతూ, రైల్వేలో సిఆర్ఎస్ వర్క్ షాప్, తిరుపతి స్టేషన్, రేణిగుంట స్టేషన్లలో పనిచేయు ఔట్సోర్సింగ్ కార్మికులకు, సెంట్రల్ లేబర్ కమిషన్ రేట్ల ప్రకారము వేతనాలు చెల్లించడం లేదని, వారికి నిబంధనల ప్రకారం సేఫ్టీ పనిముట్లు, ఆరోగ్య బీమా మినిమమ్ వేజెస్ సక్రమంగా చెల్లించాలని కోరారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో గుంటూరులో జరిగే మహాసభలో కార్మికుల /ఉద్యోగుల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

కళత్తూరు నిర్వాసితులకు చేయూత

వరద ముంపు బాధితుల సహాయార్థం విరాళాలు, నిత్యావసరాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేవీబి పురం మండలం, కళత్తూరు నిర్వాసితులకు పుత్తూరు పట్టణంలో సిపిఎం పార్టీ కార్యకర్తలు వస్తువులు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, పుత్తూరు ప్రాంతీయ కార్యదర్శి వెంకటేష్లు మాట్లాడుతూ కేవీబి పురం మండలం, కళత్తూరు, దళిత కాలనీ గత 6వ తేదీన సంభవించిన అకాల జలప్రళయానికి గురై సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవడానికి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వస్తు సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పేదలకు ఉపయోగపడే వస్తువులు ఏవూనా ఇవ్వవచ్చని తెలిపారు. పుత్తూరు పట్టణంలో కొందరు దాతలు పెద్ద మనసుతో బట్టలు, వస్తువులు విరాళంగా ఇచ్చినందుకు వారికి సిపిఎం పార్టీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలాంటి ఆపదలు వచ్చిన సందర్భంలో సాటి మనిషికి సహాయ పడాలనే దృక్పథం అందరిలో కలగాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు రమేష్, ముని శంకర్, మురుగేష్ అముదా, నందయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పిచ్చాటూరు: కెవిబి పురం మండలం, రాయల్ చెరువు వరద ముంపు ఘటనలో నిరాశ్రయులైన కళత్తూరు దళితవాడకు చెందిన 100 కుటుంబాలకు నిత్యావసర వస్తువులను నింద్ర మండలానికి చెందిన వైసిపి నాయకులు, గ్రామ సర్పంచ్ వసంత బాబు రెడ్డి, కొప్పేడు మాజీ సర్పంచ్ అనిల్ 80 వేలు రూపాయల విలువైన నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవిందం, శివలింగం, నాగూర్, బాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందిస్తున్న వైసీపీ నాయకులు

భవన నిర్మాణాల అనుమతిలో
మార్పులను అవగాహన చేసుకోవాలి

- తుడా సిపిఓ దేవి కుమారి

తుడా సిపిఓ దేవి కుమారిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణాల అనుమతుల్లో తెచ్చిన మార్పుల గురించి ఎల్టిపీలు అవగాహన చేసుకుని పనిచేయాలని తుడ ప్లానింగ్ అధికారి దేవి కుమారి తెలిపారు. ఆదివారం ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ (టేప్) ఆధ్వర్యంలో లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్కు (ఎల్ టి పి) అవగాహన సదస్సు స్థానిక టేప్ నిలయంలో నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర మున్సిపల్ శాఖలో నూతనంగా ప్లానింగ్ విభాగంలో ప్రవేశపెట్టిన సాఫ్ట్వేర్ (సివిట్) కు సంబంధించి అవగాహన సదస్సు టేప్ ప్రెసిడెంట్ మట్లీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగినది. ఈ కార్యక్రమానికి తుడా సి.పి.ఓ. దేవి కుమారి హాజరై ప్రసంగించారు. సాఫ్టెక్ నుంచి వంశి, సాఫ్ట్వేర్లో నైపుణ్యం కలిగిన ఎల్టిపి సందీప్ తదితరులు పాల్గొని, సాఫ్ట్వేర్లో వచ్చిన మార్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ వేంకటేశ్ బాబు, వైస్ ప్రెసిడెంట్లు సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, జనరల్ సెక్రెటరీ బుసా షణ్ముగం, జాయింట్ సెక్రెటరీలు బంగారయ్య, శివ శంకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరేష్, సురేష్ ఈసీ మెంబర్లు వసంతరావు, కిషోర్, రఘురామిరెడ్డి, ఎల్టిపిలు, సభ్యులు పాల్గొన్నారు.

నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ప్రాధాన్యంగా ప్రాజెక్టులు పూర్తి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. తిరుపతి గంధమనేని శివయ్య భవనంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగు, నీటి ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. గాలేరు-నగిరి, హంద్రీ-నీవా, తెలుగు గంగ, సోమశిల-కండలేరు వంటి ప్రాజెక్టులకు సరిపడా నిధులు కేటాయిస్తే ప్రతి జిల్లాకు 100 టీఎంసీల నీటిని అందించే సామర్థ్యం ఉందని తెలిపారు. వీటి ద్వారా రాయలసీమ సస్యశ్యామలంగా మారుతుందన్నారు. ఈ ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రాధాన్య జాబితాలో పెట్టకపోవడం విచారకరమన్నారు. వెలుగొండ ప్రాజెక్టు గత మూడు దశాబ్దాలుగా ఆలస్యమవుతున్నదని గుర్తుచేసిన ఆయన, నాలుగు వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తే కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. కానీ ప్రభుత్వం కేవలం బడ్జెట్ కేటాయింపులకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ విద్యలో ప్రైవేటీకరణ దోరణిని ఖండించారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని గాలికొదిలేశారని, పేదలకు వైద్యం అందకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాల పంపిణీ వాగ్దానం మాటలకే పరిమితమైందని, ప్రజా ప్రయోజనాలపై కాకుండా కార్పొరేట్ ప్రయోజనాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకరించిందని వ్యాఖ్యానించారు. కేవీబీ పురం మండలం, ఓలూరు గ్రామం వద్ద రాయలచెరువు తెగిపోవడంతో జరిగిన నష్టం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. హరినాథ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు పూర్తిగా తెగిపోవడంతో మూడు గ్రామాలు మునిగిపోయి, 150 ఎకరాల పంట పొలాలు నాశనమయ్యాయని తెలిపారు. పశువులు, గొర్రెలు వరదలో కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం నామమాత్రపు పర్యటనలకు మాత్రమే పరిమితమైందని విమర్శించారు. బాధిత కుటుంబాలకు తక్షణ పరిహారం అందించాలని, కొత్తగా ఇళ్లు కట్టుకోవడానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువులు, ప్రాజెక్టుల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, నదియా తదితరులు పాల్గొన్నారు.

అధునాతన పాకశాల నిర్మిస్తాం : అంబానీ

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ముఖేష్ అంబానీ

శ్రీవారి ఆలయం ముందు ముఖేష్ అంబానీ, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు

ప్రజాశక్తి - తిరుమల: రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కీలక నిర్ణయం ప్రకటించారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అంబానీ టీటీడీతో కలిసి కీలక ప్రకటన చేసారు. నిత్యం లక్షలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందించే అన్నప్రసాద ట్రస్టుకు ఆధునిక వంటశాల నిర్మాణ బాధ్యతలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. టీటీడీతో కలిసి ఈ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. తిరుమల చేరుకున్న ముఖేష్ అంబానీ ఆదివారం ఉదయం స్వామి వారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ముఖేశ్ అంబానీకి టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు శాలువా కప్పి వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. అంబానీ తిరుమల వేదికగా కీలక నిర్ణయం తీసుకున్నారు. నిత్యం దాదాపు 2 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్న శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టు కోసం ఒక ఆధునికమైన.. అత్యున్నత ప్రమాణాలతో కూడిన వంటశాల (కిచెన్) నిర్మించనున్నట్లు ప్రకటించారు. శ్రీవారి దివ్య ఆశీస్సులతో ఈ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కొత్త వంట శాల అధునాతన ఆటోమేషన్ను కలిగి ఉంటుందని వివరించారు. ప్రతిరోజూ రెండు లక్షల కంటే ఎక్కువ భోజనాలను తయారుచేసి, అందించే సామర్థ్యాన్ని కలిగి ఉండేలా తీర్చి దిద్దుతున్నట్లు రిలయెన్స్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. తద్వారా, ప్రతి భక్తుడికి అత్యంత భక్తి, పరిశుభ్రత, శ్రద్ధతో తయారుచేసిన పౌష్టికాహార అన్నప్రసాదం ప్రేమతో అందుతుందని వివరించారు. టీటీడీ ఆలయాల్లో అన్నింటిలోనూ అన్న ప్రసాదాలు అందించాలనే నిర్ణయాన్ని స్వాగతించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడుపు నొప్పి తాళలేక భార్య ఆత్మహత్య.. భార్య మరణం తట్టుకోలేక భర్త ఆత్మహత్యా యత్నం..

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి.. అనాథలైన ముగ్గురు పిల్లలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : భార్య మరణాన్ని తట్టుకోలేక ఈ నెల 5వ తేదీన ఆత్మహ త్యాయత్నానికి పాల్పడిన పట్టణంలోని గాండ్ల వీధికి చెందిన చలపతి (46) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కడుపు నొప్పి తాళలేక ఈ నెల 4న కవిత(44) ఆత్మహత్య చేసుకుంది. భార్య అంత్యక్రియల అనంతరం ఈ నెల 5న చలపతి కూడా ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ క్రమంలో చెన్నై లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆదివారం చలపతి కూడా మృతి చెందాడు. వీరి మృతితో బిటెక్ చదువుతున్న అమ్మాయి, ఇంటర్ చదువుతున్న అబ్బాయి, పదవ తరగతి చదువుతున్న మరో అమ్మాయి అనాథలయ్యారు.

అత్యాధునిక వైద్యానికి కేరాఫ్ 'వెంకట రమణ'

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: గుండె జబ్బులకు 'వెంకట రమణ హార్ట్ అండ్ గైనకాలజీ' సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందిస్తున్నట్లు ఆ ఆసుపత్రి అధినేతలు డాక్టరు సి.వెంకటరమణ, డాక్టరు నిరుపమా తెలిపారు. స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని వారి ఆసుపత్రి ఆవరణంలో 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ గుండె మానవ శరీరంలోనిన అన్ని అవయవాలకు రక్తం సరఫరా చేస్తుందన్నారు. కణాలన్నింటికి రక్తం ద్వారా ఆక్సిజన్, ఇతర పోషకాలను అందిస్తుందని తెలిపారు. విరామం లేకుండా తన సేవలను గుండె అందిస్తుందన్నారు. ఈ క్రమంలో గుండె పలుమార్లు తీవ్ర ఒత్తిడికి గురవుతుందన్నారు. గుండె కవటాలు, గుండెలోని కరెంటు వ్యవస్థ, పెరికార్నియం (గుండెపై ఉండే పొర), కరోనరీ రక్తనాళాలు (గుండెకు రక్తాన్ని అందించే రక్త నాళాలు) వంటి వాటిలో ఇబ్బందులు ఉంటాయన్నారు. గుండె కండరాలకు రక్తం సరఫరా ఆగిపోవడాన్నే గుండెపోటుగా చెబుతారు. గుండెకు సంపూర్ణ వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలతోఆర్యోగంగా ఉండొచ్చన్నారు.

డాక్టర్ సి.వెంకటరమణ

డాక్టర్ నిరుపమ

గుండెజబ్బులపై అశ్రద్ధ వద్దు

గుండె జబ్బులపై ప్రజలు అశ్రద్ధ చేయవద్దు. చాలా మంది తమకు గుండె నొప్పి లక్షణాలు ఉన్నా.. వాటిని పెద్దగా పట్టించుకోరని, సమీపంలోని చిన్న చితకా ఆసుపత్రులకు వెళ్లి, గ్యాస్ట్రిక్ సమస్యకు సంబంధింన చికిత్స తీసుకుని అశ్రద్ధ చేస్తుంటారు. సుమారు 8 నుంచి 12 గంటలపైగా నొప్పిని అనుభవించిన తర్వాత సంబంధిత గుండె వైద్యులను సంప్రదిస్తారు. ఇది సరైనది కాదు. గుండె నొప్పి వచ్చిన 6 గంటల తర్వాత గుండెకు సంబంధించిన సుమారు 90శాతం భాగంగా డ్యామేజీ అవుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని గుండె జబ్బులపై అశ్రద్ధ చేయకుండా వెంటనే సంబంధిత నిపుణులను సంప్రదిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

గుండెపోటు లక్షణాలు..

ఛాతి మధ్య భాగంలో అసౌకర్యంతో కూడిన ఒత్తిడి, బరువుగా ఉన్నట్లు, మెలిపెట్టినట్లు నొప్పి ఉండవచ్చు. ఇది కొన్ని నిమిషాలు పాటు ఉంటుంది. వీపునొప్పి, కడుపుపై భాగంలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు వస్తాయన్నారు. తలలో చెమటలు పట్టడం వంటి లక్షణాలు గుండె పోటుకు దారితీస్తాయి. ఈ లక్షణాలున్న వారు వెంటనే దగ్గరలోని కార్డియాక్ హాస్పిటల్లో చూపించుకోవాలి. రక్తంలో కొలస్ట్రాల్ శాతాన్ని తగ్గించుకోవడం, ఉదయం, సాయంత్రం నడక మంచిది.

ప్రైమరీ యాంజియోప్లాస్టీ ప్రోసీజర్ ద్వారా..

గుండె సంబంధిత వైద్యం అందించడంలో గత 25 సంవత్సరాలు అనుభవం కలిన ఇంటర్నేషనల్ కార్డియాలజీస్టు డాక్టరు వెంకటరమణ వేలాది మందికి యాంజియోగ్రామ్, యాంజియో ప్లాస్టైస్, వాల్వ్లో ప్లాస్టైస్ వంటి వైద్య పద్ధతుల ద్వారా చాలా మంది రోగుల ప్రాణాలను కాపాడారు. ప్రైమరీ యాంజియో ప్లాసీ అనేది గుండెపోటుకు గురైన వ్యక్తి ప్రాణాలు పోకుండా అనుసరించే నూతన విధానం. ఇది వెంటకరమణ హార్ట్ అండ్ మెటర్నిటీ హాస్పిటల్లో ఉంది. 6 గంటలోపు గుండెపోటుకు గురైన వ్యక్తికి 100 శాతం గుండెలో బ్లాక్లను తీసేయవచ్చన్నారు. గుండె వైద్యంలో ప్రైమరీ యాంజియోప్లాస్టీ అనేది ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు. తమ ఆసుపత్రిలో ప్రైమరీ ఆయంజియోప్లాస్టీ 98శాతం విజయవంతంగా చేఆవమన్నారు. వెంకట రమణ హార్ట్ ఆసుపత్రిలో ఉన్న నిష్టాత అనుభవం కల్గిన వైద్య బృందంతో రోగుల ప్రాణాలను కాపాడుటలో విజయం సాధిస్తున్నామన్నారు.

వైద్య శిబిరాలు..

తిరుపతి నగర పరిధితో పాటు పరిసరాల ప్రాంతాల్లో వెంకటరమణ హార్ట్ అండ్ మెటర్నటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అనేక ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. మారుతున్న కాలం ప్రకారం రోగాలకు ఆధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చిందని, ఈ నూతనంగా వచ్చిన వైద్య సదుపాయాలను ప్రజలకు ఎప్పటికప్పుడు ఈ వైద్యశిబిరాలు, అవగాహన సదస్సులు ద్వారా వివరిస్తున్నామన్నారు. తమ ఆసుపత్రిలో గుండెపోటు వచ్చిన వారికి 24 గంటలలోపు ఉచితంగా స్టెంట్ అమర్చే సదుపాయం ఉందన్నారు. బైపాస్ సర్జరీ, గుండె ఆపరే షన్లు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. గుండె జబ్బులతో పాటు స్త్రీలకు సంబంధించిన గర్భశయ వ్యాధులు, ఇతరాత్ర వాటికి ప్రముఖ గైనకాలజీస్టు డాక్టరు ఆర్.నిరుపమ ఆధ్వర్యంలో అత్యాధునిక వైద్యాన్ని, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో అందిస్తున్నామన్నారు. ఇది గవర్నమెంట్ అప్రూవుడ్ ఫ్యామిటీ ప్లానింగ్ సెంటర్. ఇక్కడ ఎస్పిడిసిఎల్, గరవ్నమెంట్ ఉద్యోగులకు రీయంబర్స్మెంట్ సౌకర్యం కలదని తెలిపారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9490109100, 9492458183 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు..

సంపూర్ణ గుండె చికిత్స, ఇసిజి - 2డి ఇకో అండ్ కలర్ డాప్లర్ పీడియాట్రిక్ (చిన్నపిల్లలు) గుండె స్కానింగు- టి.ఎం.టి హొల్టర్- ట్రాప్ట్ టి అండర్ 1, వెంటిలేటర్ సదుపాయం - 24 గంటలు ఇంటెన్సివ్ కేర్ సదుపాయం - 24 గంటలు ఎమర్జెన్సీ- ఏపి ఎస్ పిడిసిఎల్ గవర్నమెంటు ఉద్యోగులకు రీయింబర్స్ మెంటు సౌకర్యం- గవర్నమెంటు అప్రూవ్డ్ ఫ్యామిలీ ప్లానింగ్ సెంటర్

'అప్ డే' సినిమాను ఆదరించండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి వాసులచే కొత్తగా నిర్మితమైన అప్ డే సినిమాను ప్రతి ఒక్కరు ఆదరించాలని ఆ చిత్ర బృందం కోరింది. అప్ డే చిత్రాన్ని ఆదివారం తిరుపతిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా గ్రూప్ థియేటర్ వద్ద ఆ చిత్ర బృందం మాట్లాడుతూ పూర్తిగా తిరుపతి వాసులచే తిరుపతిలో నిర్మితమైన ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరు ఆదరించాలని, ఇది పూర్తి వినోదభరిత చిత్రం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ థియేటర్స్ అధినేత వరలక్ష్మి కృష్ణమూర్తి, బీసీ సెల్ నాయకులు జగన్నాథం, వారాహి డెవలపర్స్ బాబ్జి, హీరో లోకేష్ ఆగేరి, హీరోయిన్ హరిక, నటులు రాయదోటి సాయి దాస్, గణేష్, సునంద, భాను, ప్రియా తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ ఫామ్ ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి వైకుంఠపురం ఆర్చ్ దగ్గర గాంధీపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన నాయుడమ్మ డెయిరీ ఫారంను ఆదివారం టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో నీటి ట్యాంకుకు మరమ్మతులు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, పిచ్చినాయుడు పల్లి పంచాయతీ, మఠంపల్లి హరిజనవాడలో తాగు నీరు హెడ్ ట్యాంక్ పైపులు, మోటార్ దెబ్బ తిని చాలా రోజులయింది. తాగు నీరు లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని కూటమి నాయకుల ద్వారా తెలుసుకొని, ఎమ్మెల్యే నాని అధికారులకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. వాటర్ ట్యాంక్ మరమ్మతులు పూర్తి అయిన సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

గంగ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలో అంగరంగ వైభవంగా నాలుగు వారాలపాటు గంగమ్మ జాతర నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. గంగమ్మ జాతరకు ఎమ్మెల్యే పులివర్తి నానిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. గంగమ్మ జాతర ఉత్సవాల్లో జరిగే కార్యక్రమాల గురించి ఎమ్మెల్యేతో చర్చించారు. ఆదివారం గంగమ్మ జాతర గోడ పత్రిక, కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పార్టీలకు అతీతంగా అంగరంగ వైభవంగా గంగమ్మ జాతరను నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.

పేదలకు న్యాయ సహాయం అందించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పేదలకు న్యాయ సహాయాన్ని అందించాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్సి రాఘవేంద్ర పేర్కొన్నారు. స్థానిక కేకేసి న్యాయ కళాశాలలో మండల న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం న్యాయ సేవ దినోత్సవం నిర్వహించారు. న్యాయ విద్యార్థులు, బీఈడీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుత్తూరు మండల న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ ఎస్సి రాఘవేంద్ర మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు, న్యాయవాదులు వృత్తి చేపట్టిన తరువాత పేదలకు న్యాయసహాయాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాలి సురేష్ బాబు, కేకేసి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, కేకేసి కళాశాల వైస్ చైర్మన్ నరసింహారావు, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదలైన చెక్కులను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. వడమాలపేట మండలం, అప్పలాయగుంటకు చెందిన చెంగమ్మకు రూ.20,000, టిసి అగ్రహారం గ్రామానికి చెందిన ముని కుమార్‌కు రూ.1,25,960, బట్టి కండ్రిగకు చెందిన మణికి రూ.35,900, ఎనములపాలెంకు చెందిన మునస్వామికి రూ. 25,000ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

సంతకాలు సేకరిస్తున్న వైసీపీ నాయకులు

ప్రజాశక్తి - నాయుడుపేట: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నాయుడుపేట మండలంలోని కూచివాడ, చిలమత్తూరు గ్రామాల్లో ఆదివారం నాయుడుపేట ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి వైసిపి నాయుడుపేట మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్‌ల ఆధ్వర్యంలో వైసిపి నేతలతో కలిసి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తమ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదేశాలతో కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్న కుట్రలను కోటి సంతకాలు పూర్తి చేయడం ద్వారా అడ్డుకుంటామని ఈ సందర్భంగా వారు అన్నారు. అనంతరం స్థానిక వైసీపీ నాయకులతో కలిసి కూచివాడ, చిలమత్తూరు గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శంకరయ్య, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధాకర్ రెడ్డి, చంద్రారెడ్డి, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడికి తుడా చైర్మన్ పరామర్శ

గాజుల రవి ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి రూరల్ మండలం, దుర్గసముద్రం గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు గాజుల రవి ప్రసాద్ తల్లి మునెమ్మ ఇటీవలే మరణించడం జరిగింది. తుడా చైర్మన్, టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి స్థానిక కూటమి నాయకులతో కలిసి రవి ప్రసాద్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతి థియేటర్ యజమాని చంద్రశేఖర్ రాజు మృతి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వడమాల పేట మండలం ఎస్ఆర్ పురం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శాంతి థియేటర్ యజమాని, రాజకీయ వేత్త, బీసీ చంద్రశేఖర్ రాజు తన స్వగ్రామంలో ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఉదయం 10:30 గంటలకు తన స్వగ్రామంలో (మామిడి తోట)ఫామ్ హౌస్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

అక్రమ కట్టడాలకు అడ్డేది..?

గ్రామకంఠం బోర్డు పెట్టిన అధికారులు.. గంటలోపే పీకేసిన కబ్జాదారుడు

హెచ్చకరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండలంలోని అడవికొడియంబేడుకు చెందిన దమయంతి (70) పట్టా భూములకు దారి లేకుండా గ్రామకంఠం సర్వే నెం 90 - 6 భూమిని ఆక్రమణ చేసుకొని అక్రమ కట్టడాలు నిర్మించారని ఆరోపించారు. కబ్జాదారుడు డేవిడ్ రాజ్ దారికి అడ్డంగా గోడ కట్టడంతో బాధితురాలు రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కోట్ల రూపాయల విలువచేసే భూమిని కబ్జాదారునికి అప్పనంగా అప్పగిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఈ సమస్యపై దమయంతి పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సత్యవేడు పర్యటన సందర్భంగా ఆయనకు కూడా వినతి సమర్పించారు. ఇందుకు స్పందించిన రెవెన్యూ అధికారులు ఆమె భూమికి వెళ్లడానికి 12 అడుగుల దారి ఏర్పాటు చేసినట్లు పిజిఆర్ఎస్‌కు, మంత్రి నారా లోకేష్‌కు తిరుగు సమాధానం అందించారు. అయితే కబ్జాదారు కట్టిన గోడ నేటికీ దారికి అడ్డంగా దర్శనమిస్తూనే ఉంది. పట్టా భూములకు దారి లేకుండా చేస్తూ ప్రభుత్వ భూములను కబ్జా చేయడమే కాక, రౌడీయిజం చలాయిస్తున్న డేవిడ్ రాజ్ చంపుతామని బెదిరిస్తున్నారని దమయంతి ఆవేదన వ్యక్తపరిచారు. గ్రామంలో రెవెన్యూ అధికారుల లీలలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని వారి అండతోనే కబ్జాదారు రాత్రికి రాత్రే దారి అడ్డంగా ప్రహరీ గోడ నిర్మించారని చెప్పారు. పంచాయతీకి చెందిన గ్రామకంఠం భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మించుకుంటున్న వైసీపీకి చెందిన కబ్జాదారులకు అడ్డు చెప్పాల్సిన అధికారులు ముడుపులు తీసుకుని ఏమీ ఎరగనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయకుంటే తనకు ఆత్మహత్యే శరణ్యమని దమయంతి ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కోట : మాజీ ఎన్డీసీసీబీ వైస్ ఛైర్మన్,ఊనుగుంటపాలెం పిఏసీఎస్ చైర్మన్, శ్రీ కోటమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆయన ఇంటి వద్ద కోట మండలం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డికి బాణాసంచా కాలుస్తూ, భారీ గజమాలతో స్వాగతం పలికారు. భారీ కేక్ కట్ చేసి పంచి పెట్టారు. మండలం నలుమూలల నుండి భారీ ఎత్తున టీడీపీ నాయ కులు, కార్యకర్తలు, నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి అభిమానులు తరలివచ్చి గజమాలలు వేసి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కోట మండల అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి నెల్లూరు మోహన్ రెడ్డి, దశరథ రామ్ రెడ్డి, కోకర్ల మధు యాదవ్, పాపారెడ్డి మనోజ్ రెడ్డి, పురుషోత్తమ రెడ్డి, షేక్ శంషుద్దీన్, చాపల శ్రీనివాసులు, తిరుమల శెట్టి కోటేశ్వరం రావు, మీజూరు మల్లికార్జునరావు, నాయబ్ రసూల్, సిద్దపరెడ్డి పోలమ్మ, సుహాసిని, తల్లం శ్రీనివాసులు, మోహన్, వంశీకృష్ణ, మధు, సురేష్, సుధీర్, వసీం, వేణు తదితరులు పాల్గొన్నారు.

పొక్కాళి వరుణ్ శెట్టి శుభాకాంక్షలు

ఆదివారం నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి నివాసం వద్ద కోట మండలం ఉత్తమనెల్లూరుకు చెందిన టీడీపీ యువ నాయకులు పొక్కాళి వరుణ్ శెట్టి జగన్మోహన్ రెడ్డిని కలిసి పూలమాల, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ బలోపేతానికి కష్టపడి పని చేయాలనీ నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి తమకు తెలియజేశారని పొక్కాళి వరుణ్ శెట్టి తెలిపారు.

ఆస్టర్ నారాయణాద్రి '9 ఫెర్టిలిటి సెంటర్' వార్షికోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లోని 9 ఫెర్టిలిటి సెంటర్ 2వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవిఎఫ్, ఐయుఐ వంటి చికిత్సల ద్వారా సంతానం పొందిన 28 మంది తల్లులు తమ పిల్లలతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారందరినీ హాస్పిటల్ తరపున ఘనంగా సత్కరించి, తల్లితనం ఆనందాన్ని పంచుకున్నారు. 9 పెర్టిలిటీ క్లినికల్ హెడ్ డాక్టర్ స్వప్న శ్రీనాథ్ మాట్లాడుతూ నా రోగులను సంతోషంగా, తల్లిదండ్రులుగా చూడడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. ఎన్నో క్లిష్టమైన కేసులను చూసినా, ప్రతి రోగిని ఆరోగ్యవంతమైన తల్లిగా, తండ్రిగా మార్చడం నా లక్ష్యం అన్నారు. ఆస్టర్ డిఎం హెల్త్ కేర్ ఏపీ తెలంగాణ క్లస్టర్స్ రీజనల్ సీఈవో డాక్టర్ హరి కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోగుల సంతృప్తి, ఫలితాల నాణ్యతే తమ లక్ష్యమని తెలిపారు. డాక్టర్ స్వప్న శ్రీనాథ్ నైపుణ్యం, అంకితభావం ప్రశంసనీయమైనవి. ఆమె కృషి వల్లే 9 ఫెర్టిలిటి అత్యుత్తమ ఫలితాలను అందిస్తోందన్నారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో అత్యాధునిక ఫెర్టిలిటి యూనిట్‌తో పాటు, అత్యుత్తమ వైద్య నిపుణుల బృందం పనిచేస్తోందని తెలిపారు. రోగుల సంతృప్తి, విజయవంతమైన ఫలితాలే మా బలమని గర్వంగా చెప్పగలమన్నారు. అధునాతన పరికరాలతో అన్ని రకాల ఫెర్టిలిటి సమస్యలను పరిష్కరించగల సదుపాయాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. పలువురు తల్లులు ఈ సందర్భంగా మాట్లాడుతూ మేము ఎప్పటికీ తల్లులు కాలేమని అనుకున్నాంమని. కానీ 9 ఫెర్టిలిటి, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌కు వచ్చిన తర్వాత డాక్టర్ స్వప్న శ్రీనాథ్ ఇచ్చిన ధైర్యం, నమ్మకం మాకు తల్లితనం ప్రసాదించిందని భావోద్వేగంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో 9 ఫెర్టిలిటి, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తాం: హర్షిత్ రెడ్డి



కేక్ కట్ చేసి నాయకులకు తినిపిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గంలో అక్రమంగా, దౌర్జన్యంగా ప్రశ్నిస్తే తమ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని, ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మాజీ శాసనసభ్యులు, తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళం పరిధిలో వైసిపి శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రజల మనిషి అని, నియోజకవర్గంలో ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరించే గొప్ప వ్యక్తిత్వం కలవారన్నారు. కూటమి ప్రభుత్వం చంద్రగిరి నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలను టార్గెట్ చేసుకొని ఇప్పటికీ వెయ్యి కేసులు పెట్టారని, ఎన్ని కేసులు పెట్టినా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేస్తామన్నారు. తమ ప్రభుత్వమే కదా అని నియోజకవర్గంలో టిడిపి నాయకులు ఊళ్లను పంచుకొని దోచుకుంటున్నారని విమర్శించారు. చెవిరెడ్డి బెయిల్‌పై త్వరగా రావాలని కోరుతూ బాలకృష్ణాపురం వద్ద ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో టెంకాయలు కొట్టి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు మూలం చంద్రమోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణయ్య, వైస్ ఎంపీపీ విడదల మాధవరెడ్డి, వైసీపీ రూరల్ మండల అధ్యక్షులు మునీశ్వర్ రెడ్డి, మంగళం డివిజన్ వైసిపి అధ్యక్షులు ప్రళయకావేరి నారాయణరెడ్డి, తిరుమల నగర్ వైసీపీ బాధ్యులు గుండ్రాజు శివశంకర్ రాజు, చిన్ని యాదవ్, తుంటి సుధాయాదవ్, మల్లెముగ్గల ఉమాపతి, చిట్టి, తిరుమల బాబు, దయాకర్, గోపి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం : మండలంలోని సి రామాపురం సమీపంలో ఉన్న అక్షయ క్షేత్రంలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అక్షయ క్షేత్రంలోని ప్రత్యేక ప్రతిభావంతులకు బ్రెడ్‌లు, స్వీట్లు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ప్రదీప్, వెంకటేష్, మోహన్ రెడ్డి, భూపాల్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద 53 కేజీల భారీ కేక్‌ను చంద్రగిరి మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ చేసారు. వైసీపీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివశంకర్ రెడ్డిల ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవి రెడ్డి హర్షిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవగా చెవిరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

పాకాల మండలంలో..

ప్రజాశక్తి - పాకాల: మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు పాకాల మండలంలో ఆదివారం మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ తమపై ఉన్న నమ్మకంతో పదిమంది వాలంటీర్లు పార్టీలో చేరినట్లు ప్రకటించారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - నాయుడుపేట:చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట డిఎస్పీ చెంచు బాబు హెచ్చరించారు. ఆదివారం నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని మునిరత్నం నగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వాహనాల రికార్డులను పరిశీలించారు. ఆధార్ కార్డులను చిరునామాలను పరిశీలించి వేలిముద్రలు తీసుకున్నారు. అనంతరం డిఎస్పీ చెంచు బాబు మాట్లాడుతూ అనుమానిత వ్యక్తుల వివరాలు పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అలాగే గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు వివరాలను పోలీసులకు తెలియజేయాలని, వివరాలు తెలియజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ సీఐ బాబి, నాయుడుపేట, ఓజిలి, దొరవారి సత్రం ఎస్సైలు ఆదిలక్ష్మి, శ్రీకాంత్, అజయ్ కుమార్, పలువురు పోలీసులు పాల్గొన్నారు.

రమ్యశ్రీకి బార్వాలే యువ పరిశోధక అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : హార్టికల్చరల్ బయోటెక్నాలజీలో చేసిన గణనీయమైన కృషికి గాను ఐఏహెచ్ఎస్ -డాక్టర్ బి.ఆర్. బార్వాలే యంగ్ రీసెర్చర్ అవార్డు ఇన్ హార్టికల్చరల్ బయోటెక్నాలజీ (డాక్టోరల్ థీసిస్ రీసెర్చ్)-2025 ను డాక్టర్ ఎం.రమ్యశ్రీకి ఇండియన్ అకాడమీ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్ ప్రదానం చేశారు. తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరీక్షల నియంత్రణ అధికారిగా పనిచేసి, ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగంలో డిప్యూటీ రిజిస్ట్రర్ పనిచేస్తున్న మూడే దామ్లు నాయక్, సుభద్ర కుమారి ల కుమార్తె డాక్టర్ మూడే రమ్యశ్రీ. డాక్టర్ వై.ఎస్.ఆర్. హార్టికల్చరల్ యూనివర్సిటీ నుంచి రమ్యశ్రీ హార్టికల్చర్‌లో బి.ఎస్.సి. (ఆనర్స్), కర్ణాటక బాగల్‌కోట్‌లోని హార్టికల్చరల్ సైన్సెస్ యూనివర్సిటీ నుంచి ఎంఎస్సి (ఫ్రూట్ సైన్స్) , న్యూఢిల్లీలోని ఐసిఎఆర్-ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి పిహెచ్డి డిగ్రీ (ఫ్రూట్ సైన్స్) పట్టా పొందారు. ఈ సందర్భంగా వర్సిటీలోని ఉన్నతాధికారులు, పలువురు ఆచార్యులు, పరిశోధకులు, అభిమానులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, మిత్రులు ఆమెకి అభినందనలు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పూజ

ప్రజాశక్తి - నాయుడుపేట:నాయుడుపేట పట్టణ సమీపంలోని కె.ఎం.ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, సునీత దంపతులు అయ్యప్ప స్వామి పూజ మహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారికి పూజలు చేశారు. వేద పండితులు స్వామివారికి పూజలు చేసి కలికి మాధవరెడ్డి, సునీత దంపతులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలికి సుదీప్ రెడ్డి, కలికి వైష్ణవి, నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, టిఎంఆర్ విద్యాసంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్ రెడ్డి, నవోదయ హైస్కూల్ కరస్పాండెంట్ పద్మనాభరెడ్డి, విశ్వాభారతీ హై స్కూల్ కరస్పాండెంట్ గోపాల్ నాయుడు, వాకాటి హర్షవర్ధన్ రెడ్డి, చిలక యుగంధర్, గీతా నంద రెడ్డి, కొప్పాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గురవయ్య మాతృమూర్తికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి నివాళి

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కల్లూరు గురవయ్య తల్లి కల్లూరు గంగమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కూచివాడ గ్రామంలోని వారి నివాసానికి చేరుకొని కల్లూరు గంగమ్మ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం జూనియర్ కళాశాల గురవయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంజీవయ్య వెంట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుడుపేట మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, వైసిపి నాయకులు చిట్టిబాబు, పలువురు నాయకులు ఉన్నారు.

జ్ఞాపకాలు మధురం

ప్రజాశక్తి - పాకాల: పాకాల మండలం, దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86 వ సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 40 ఏళ్ళ తరువాత కలుసుకున్న మిత్రులు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలను తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను ఓసారి గుర్తుకు తెచ్చుకొని సంబరపడ్డారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు అన్నయ్య నాయుడు, సీతాపతి నాయుడు, విశ్వనాథరెడ్డి, టీవీఎస్, నందకుమార్, సులోచనాదేవి, సయ్యద్ బాషాపీర్, మనోహర్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ సమన్వయకర్త పత్తిపాటి దేవరాజుల నాయుడు, ఎంఈఓ బాబ్జి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శంకర్ రెడ్డి వైఖరిపై మండల స్థాయి సమావేశం

ప్రజాశక్తి - సత్యవేడు: తాజాగా వచ్చిన పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి తీసుకునే ఏకపక్ష నిర్ణయాలకు పార్టీ తీవ్రంగా నష్టపోతోందని పలువురు మండల టిడిపి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దాంతోపాటు అధికార దాహంతో పార్టీలోకి వచ్చిన వారి వ్యవహార శైలితో ద్వితీయ శ్రేణి నాయకులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక మండల టిడిపి అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి, కొన్ని ఏకపక్ష నిర్ణయాలు, తాజాగా పార్టీలోకి వచ్చిన జడ్పిటిసి భర్త చంద్రశేఖర్ రెడ్డి వ్యవహార శైలితో మండలంలో సీనియర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ రెడ్డి మద్దతుదారులు ప్రభుత్వ కార్యాలయాల్లో పెత్తనం సాగిస్తూ.. టిడిపి శ్రేణుల అభ్యర్థనలు, ఆవేదనలు, సమస్యలు పట్టించుకునే దిక్కు లేదని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జడ్పిటిసి పదవికి రాజీనామా చేయకుండా ఆయనను టిడిపిలోకి చేర్చుకోవడంతోనే సమస్యలు వచ్చాయని పలువురు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కాలమనాయుడుపేటలో ఇళ్ల స్థలాలన్నీ వైకాపా వారికే చేరిందని, టిడిపి నాయకులు సూచించిన వారికి, ఇతరులకు సెంటు స్థలం దక్కకుండా పోయిందన్నారు. ఆ ఇళ్ల స్థలాల పంపిణీలో భారీగా అక్రమాలు జరిగాయని కూడా సమావేశం దృష్టికి కొందరు తీసుకువచ్చారు. ఆంబాకంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతున్నప్పటికీ ఆయనకు జడ్పిటిసి మద్దతు పలకడం ఎంతవరకు సబబుగా ఉందో అర్థం చేసుకోవాలని తెలియజేశారు. ఇటీవల కెఎస్ఎస్ గ్రామ కమిటీలను ఎవరితోను చర్చించకుండా పలువు సీనియర్ నాయకులను కార్యకర్తలను ఆఘమేఘాలపై తప్పించడం ఎంతవరకు న్యాయమంటూ మరికొందరు మండల నాయకులను ప్రశ్నించారు. వైసీపీలో ఉన్నప్పుడు ఇదే చంద్రశేఖర్ రెడ్డి అనేకమంది టిడిపి నాయకులను తప్పుడు ఫిర్యాదులతో వేధించడం అందరికీ తెలుసునని, అప్పట్లో కేసులు పెట్టి.. ఇప్పుడు మా అన్న శంకర్ రెడ్డి అన్ని నాకే కావాలి, నేను చెప్పినట్లే జరగాలి మండలం పూర్తిగా అనే విధంగా చంద్రశేఖర్ రెడ్డి దూసుకుపోవడం మూలంగా పార్టీ తీవ్రంగా నష్టపోతుందని పలువురు మండల్ నాయకులు సమావేశంలో గగ్గోలు పెట్టారు. నామినేటెడ్ పదవులు కూడా శంకర్ రెడ్డి ఏకపక్ష నిర్ణయాలతో భర్తీ చేయడంవల్ల స్థానిక ఎన్నికల్లో పార్టీ తీవ్రంగా నష్టపోతుందన్నారు. దీనిపై మండల నాయకులు స్పందిస్తూ ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకుని వెళ్తామని, జెండా మోసిన ప్రతి కార్యకర్తలు, నాయకులను కాపాడుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు క్లస్టర్ ఇంచార్జ్ పరమశివం, సింగిల్ విండో చైర్మన్ మోహన్ ముదిరాజ్, టౌన్ ప్రెసిడెంట్ షణ్ముగం, సీనియర్ నాయకులు బ్యాటీ చంద్రయ్య, కాశి ప్రతాప్ రెడ్డి, ఎంఎం రవి, పిఎస్ఆర్, హాస్పిటల్ కమిటీ మెంబర్స్ హేమభూషణ్ రెడ్డి, ధన, మాజీ ఎంపిటిసి అమావాస్య రెడ్డి, చిట్టి రెడ్డి, రవి ఆనందయ్య, శంకరయ్య, ప్రతాప్ రెడ్డి మధు, మధు యాదవ్, సంపత్ కుమార్ యాదవ్, కార్యకర్తలు, నాయకులు పాల్గొ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రేషన్ బియ్యం పట్టివేత

బియ్యం తరలిస్తున్న వ్యాన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ నలుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్దనుంచి 74 బస్తాల బియ్యం(3350 కిలోలు), బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి టూ టౌన్ పోలీసులకు వచ్చిన రహస్య సమాచారం మేరకు ఎంజీఎం హాస్పిటల్ సర్కిల్ వద్ద కాపు కాసి అనుమానస్పదంగా వెళ్తున్న బొలేరోను అడ్డుకుని తనిఖీలు చేపట్టగా అక్రమ రవాణా గుట్టు బయట పడింది. వాహన యజమానితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

రాంగ్ రూట్‌లో దూసుకెళ్లిన తమిళనాడు బస్సు

■ ద్విచక్ర వాహన చోదకుడికి తీవ్ర గాయాలు

కల్వర్టులో పడటంతో కమ్ములు గుచ్చుకుని గాయాలపాలైన స్కూటరిస్ట్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :పుత్తూరు మండలం, పరమేశ్వర మంగళం సమీపంలో శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తమిళనాడు రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన బస్సు రాంగ్ రూట్‌లో వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి నిర్మాణంలో ఉన్న కల్వర్టులో పడిపోయారు. ఈ ప్రమాదంలో బైక్ నడిపిన వ్యక్తి కడుపులో ఇనుప కమ్మీలు గుచ్చుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అప్రమత్తమై 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి, ఇనుప కమ్మీలను కత్తిరించి గాయపడిన వ్యక్తిని పుత్తూరులోని ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ద్విచక్ర వాహనం నుండి జారిపడి మహిళ మృతి

మృతి చెందిన కళావతి

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: ద్విచక్రవాహనం నుండి మహిళ జారిపడి మృతి చెందిన ఘటన మండలంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన పోలీసు లు అందించిన వివరాలు తడ మండలం, మాంబట్టు అపాచిలో పని చేస్తున్న కార్మికుడు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన మునెయ్య ఆదివారం శ్రీకాళహస్తి ఆలయ దర్శనం చేసుకుని మాంబట్టుకు తిరిగి వస్తుండగా శ్రీకాళహస్తి మున్సిపాలిటి దగ్గర బీఎన్ కండ్రిగ మండలం వెస్ట్ వరవత్తూరుకు చెందిన కళావతి(59) కూలీపనులు చేసుకుని బస్సు కోసం ఎదురు చూస్తుండగా ద్విచక్రవాహనంలో వస్తున్న మునెయ్యను లిఫ్ట్ అడగడంతో ఎక్కించుకున్నారు. మండలంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీ దగ్గర ద్విచక్రవాహనంలో వెనుక కుర్చున్న కళావతి జారిపడి కిందపడిపోయింది. దీంతో మునెయ్య 108కు సమాచారం అందించి వైద్యం కోసం శ్రీకాళహస్తి ఏరియా అసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృత దేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా అసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

కోర్టు పరిధిలో ఘర్షణ..
లాయర్‌పై దాడికి యత్నం, కేసు నమోదు

సాయి ప్రసాద్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, దాడికి వాడిన కారు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విడాకుల కేసు వివాదం ఉద్రిక్తంగా మారి హత్యాయత్నం స్థాయికి చేరింది. కోర్టు పరిధిలో న్యాయవాదిపై కారుతో దూసుకెళ్లిన ముద్దాయిని పుత్తూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. తిరుపతి, భవాని నగర్‌కు చెందిన న్యాయవాది ఏ.రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండలం, నడవలూరుకు చెందిన కె.సాయి ప్రసాద్ రెడ్డి (33)పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. సాయి ప్రసాద్ రెడ్డి తన భార్య హేమలతతో పరస్పర ఒప్పందం ప్రకారం విడాకులు కోసం పుత్తూరు కోర్టును ఆశ్రయించాడు. అయితే, హేమలత తరపున న్యాయవాది రాజశేఖర్ గత నాలుగు నెలలుగా కేసు పరిష్కారంలో ఆలస్యం చేస్తున్నాడని అసహనానికి గురైన సాయి ప్రసాద్ రెడ్డి, శనివారం పుత్తూరు కోర్టు పరిధిలో న్యాయవాదిపైకి, తన కారుతో ఉద్దేశపూర్వకంగా దూసుకెళ్లి చంపడానికి యత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరు, పున్నమి సర్కిల్ వద్ద ముద్దాయిని పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

లారీ చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: లారీ చోరీ ఘటనపై టూ టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు..పీలేరు ప్రాంతానికి చెందిన మధుసూదన్ శ్రీకాళహస్తిలో లారీ సర్వీసు నడుపుతున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని కాసాగార్డెన్ సమీపంలో శుక్రవారం రాత్రి లారీని నిలిపి డ్రైవర్మ ఇంటికెళ్ళగా, క్లీనర్ జయచంద్ర వాహనంలోనే పడుకున్నాడు. తర్వాతి రోజు డ్రైవర్ వచ్చి చూడగా లారీతో పాటు క్లీనర్ జయచంద్ర కనిపించలేదు. ఈ మేరకు లారీ యజమాని మధుసూదన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయొద్దు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వ వైద్య కాలేజీలను ప్రైవేట్ పరం చేసి, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వ విధానాన్ని అడ్డుకోవాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కరపత్రాలు విడుదల చేశారు. అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JDUGE (SENIOR DIVISION) TIRUPATI

I.A. No. 1036 OF 2024
O.S. No. 77 OF 1987

Nelluru Gnaneswari & 4 others
...Petitioners/Plaintiffs
And
Nelluru Murali & 7 others
...Respondents/Defendants

I.A. NOTICES TO RESPONDENTS Nos. 1, 7 AND 8

R1: Nelluru Murali, S/o. late Subbaramaiah, Residing at Door No. 2-64, Thimminaidupalem Village, Akkarampalli Post, Tirupati Urban Mandal,
R7: Venkatachalapathi Mills Ltd., Rep. by its Managing Director, Holding his office at Mill Premises. Reniugnta Road, Tirupati
R8: Kota Subramanyam, S/o. not known, Residing at Door No. 491, Bandla Street, Tirupati.

Please take notice that the petitioners/ plaintiffs filed the above I.A. against respondent No.1, 7 and 8 and others for partition the suit schedule properties and for separate possession of petitioners/ plaintiffs share and the above case is posted to 10-12-2025 for your appearance before the above said court. If you fail to appear before the above said court on 10-12-2025 at about 10-30 A.M. the matter will be decided in your absence as exparte.

Hearing Date: 10-12-2025
(By order of the Court)
M. RADHAIAH
Advocate for petitioners / plaintiffs
Advocate, Tirupati